# హాబీ

దాదాపు ఐదు సంవత్సరాల క్రితం నేను ట్రాన్స్‌పోర్టు కమిషనరుగా వున్నప్పుడు ఏదో ప్రచురణ సంస్థ తరఫున నటరాజన్ అనే వ్యక్తి నావద్దకు వచ్చాడు. తమ సంస్థ "ఆంధ్రప్రదేశ్ లోని విశిష్ట వ్యక్తుల వివరాలు" అనే బృహత్ గ్రంథాన్ని ప్రచురించనున్నదనీ, దాన్లో నాగురించి కూడా వ్రాయాలి కాబట్టి రెండు ఫొటోలు, నా వ్యక్తిగత వివరాలు కావాలని అడిగాడు. నేను ఉబ్బి తబ్బిబ్బైనా పైకి మాత్రం 'ఎందుకండీ అంతటి ఉద్గ్రంథంలో నా పేరు? నేను సమాజంలో చాలా చిన్న వ్యక్తిని' అన్నాను. నా వివరాలు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. నేను నా వివరాలు చెబుతుంటే ఆయన వ్రాసుకుపోతున్నాడు.

అన్నీ అయింతర్వాత 'మీ హాబీలు ఏమిటి?'అని అడిగారు. నేను అనుమానంగా నా హాబీల గురించి మీకెందుకు అంత ఆసక్తి? అని ప్రశ్నించాను. ఆయన 'మీకు తెలియదుటండీ! పెద్దవారి హాబీల గురించి తెలుసుకోవాలని అందరికీ వుంటుంది, ఇంత ఉన్నత స్థానానికి ఎదిగిన మీకు హాబీలు తప్పకుండా వుండాలి',' చెప్పండి ప్లీజ్! దీన్లో అనుమానించదగిన విషయమేమీలేదు' అన్నాడు.

నేను నాలుగైదు నిమిషాలు ఆలోచించాను. చివరికి గంభీరంగా మొహం పెట్టి'పుస్తకాలు చదవడం, నడక, నా హాబీలు' అని చెప్పాను.

దీనికి నటరాజన్ ఆశ్చర్యంగా నోరు తెరిచి 'అవేం హాబీలండీ? పుస్తక పఠనం ఒక హాబీగా మీరు భావిస్తున్నారా? ఒక మోస్తరు చదువు నేర్చుకున్న ప్రతివాడూ ఏదో ఒకటి చదువుతాడు గదండీ! ఇక నడక అంటారా ఈ ప్రపంచంలోకి అడుగిడిన ప్రతి జీవికీ నడక తప్పదు కదండీ! ఏ అంగ వైకల్యం వస్తే తప్ప అందరూ నడక నేర్చుకోవలసిందేగా!'అన్నాడు.

నాకు వళ్ళు మండింది. 'నేను ఏదో ఆషామాషీ పుస్తకాలు చదువుతాననుకుంటున్నారా? పెద్ద పెద్ద రచయితలవి, అందునా రష్యన్ రచయితలంటే నాకిష్టం. ఇక నడక అంటారా అందరూ నడవాల్సిందేనన్న మీ అభిప్రాయంతో ఏకీభవిస్తాను. కాని నా నడక ఈ జనావాసాల కాంక్రీటు అరణ్యంలో కాదు. నా హాబీ అడవుల్లో నడవడం, ప్రకృతి అందాలు తిలకించడం' అన్నాను.

నా జవాబు ఆయనను ఏ మాత్రం ప్రభావితం చేయలేకపోయిందనడానికి ఆయన మూతి విరుపులే ప్రత్యక్ష నిదర్శనంగా కన్పించింది. ఆయన తల అడ్డంగా వూపి 'మీరు రోజూ వేదాలు చదువొచ్చుగాక! అది హాబీ కాదు. ఇక నడక అంటారా! రోజూ దండకారణ్యంలో నడిచినా అది హాబీ కాదు' అన్నాడు.

నేను జవాబుగా 'మీ దృష్టిలో హాబీ అంటే దొంగచాటుగా ఇతరులకు వచ్చే పోస్టల్ కవర్లపై అంటించిన స్టాంపులను వెదికి దాచుకోవడం కాబోలు' అని అంటించాను.

ఆయన ఏమాత్రం జంకలేదు. 'అలా అందరిపై నిందలు వేయకండి!, అందరూ దొంగచాటుగా మీరు చెప్పినట్టు స్టాంపులు కలెక్ట్ చేయరు, అయినా నాదృష్టిలో ఇలా చేసినా తప్పు లేదు, ఎందుకంటే ఆ చర్య ఆ వ్యక్తికి తన హాబీపై వున్న ఉత్సుకతను తెలియపరుస్తుంది'అన్నాడు.

అలా ఐదు సంవత్సరాల క్రితం పరిచయమైన ఆ వ్యక్తి మళ్ళా జాడా లేదు. ఆయన చెప్పిన సదరు ఉద్గ్రంథం ప్రచురణకు నోచుకుంటుందో లేదో తెలియదు. కాని ఈ మధ్యనే నాకు మళ్ళీ ఆయన వద్ద నుంచి ఫోను వచ్చింది. తాను నన్ను ఇంటర్వ్యూ చేస్తాడట! నా అపాయింటుమెంటు అడిగాడు. ఉన్న పాత చేదు అనుభవం దృష్ట్యా తొలుత ఆయనకు ఇంటర్వ్యూ ఇవ్వకూడదని అనుకున్నా. ఎందుకులే పోటీదురుసు మనిషి అని ఒక పదిహేను రోజుల తర్వాత ఓ శుభ ముహూర్తాన కలవవలసిందిగా చెప్పాను. ఆయన సరే అన్నాడు.

ఇంటర్వ్యూకి టైము ఇచ్చానే గాని నాకు మన శ్శాంతి కరవైంది. ఈ ఐదు సంవత్సరాలలోనూ నేను కొత్తగా ఏ హాబీని ఏర్పర్చుకోలేదు. అసలా ఆలోచనే రాలేదు. ఒక వ్యక్తి పరిపూర్ణ వికాసానికి చిహ్నం ఆయన హాబీలే అని ఏనాడో అన్న నటరాజన్ మాటలు నా చెవిలో మార్మోగుతున్నాయి. ఆ రాత్రి చాలా సేపు మంచంలో అటూ ఇటూ దొర్లాను. చివరకు ఒక నిర్ణయానికి వచ్చాను. ఆ మరునటి రోజు పాత సామానులు భద్రపరిచే పెట్టె తెరిచాను. చాలాసేపు వెతకగా వెతకగా నేను కోరిన వస్తువు దొరికింది. అది 1982 నాటి పార్కర్ గోల్డ్‌పెన్. ఎవరో మిత్రుడు అమెరికా నుంచి వస్తూ తీసుకొచ్చి బహూకరించినదది. దానితో చిక్కేమిటంటే అది పాతకాలపు ఇంకు పోసి వ్రాసుకునే పెన్ను.అసలు అవసరానికి పనికిరాదు. బాగా విదిలించితే కాని ఇంకు నిబ్బులోకి పారదు. మొదట్లో ఒకటి రెండు సార్లు అలా విదిలించినందుకు అప్పటి కమిషనరు గారితో చీవాట్లు తిన్నాను.' ఈ పాతరాతి యుగపు పనిముట్లు ఎందుకు? కొత్తగా మార్కెట్‌లోకి వచ్చాయి బాల్ పాయింట్ పెన్నులు. చాలా చవక! ఒకటి కొనుక్కో! ఇలా తివాచీలు పాడుచేయకు' అని ఆయన ఉచిత సలహా పారేసే సరికి ఉడుక్కున్నాను.తప్పు నాదే కదా!.

అయినా ఆ పెన్ను ఇప్పుడు ఇలా పనికి వస్తుందనుకోలేదు. దాన్ని పాత తువ్వాలుతో తుడిచి తళతళా మెరిసేలా చేశాను. ఆఫీసుకు వెడుతున్నప్పుడు నా షర్టు జేబులో నా మామూలు పెన్నుతో పాటు దాన్ని కూడా పెట్టుకున్నాను. బయటకు వస్తున్నప్పుడు మా శ్రీమతి అడిగింది 'రెండు పెన్నులు పెట్టుకున్నారెందుకండీ!. ఓహో! ఒకటి ఎలాగూ వ్రాయదుగనుకనా!'అని ఎకసెక్కెం చేసింది. 'నేను రచయితను గదా! ఈ మధ్య రచయితలందరూ రెండు పెన్నులు పెట్టుకోవడం ఫ్యాషన్‌గా మారింది' అన్నాను సీరియస్‌గా.

'ఆ! ఏమి రచయితలండీ! ఇదివరకంటే 'ఆంధ్ర జ్యోతి'లోనో, 'స్వాతి'లోనో వ్రాసేవారు, ఇప్పుడు ఒక్క 'సురక్ష' కేగా వ్రాస్తున్నది'!అన్నది. ఆ మాటల్లోని వ్యంగ్యాన్ని దులిపేసుకొని కారెక్కాను. ఆ సాయంత్రం నారాయణగూడా వెళ్ళి అక్కడ వాళ్ళింట్లో వున్న నా మనుమడు వరుణ్‌ని కారెక్కించుకొని ఇంటికి బయల్దేరాను. తెల్లవారితే నటరాజన్‌తో ఇంటర్వ్యూ. ఆ ఆలోచన రాగానే పులి

క్కివడి జేబు తడుముకున్నాను. రెండు పెన్నులూ భద్రంగా వున్నాయి. కారు జోరుగా , హుస్సేన్‌సాగర తీరం వెంట మెత్తగా వెడుతోంది. వీస్తున్న గాలి కంపుగా ముక్కుపుటాల్ని అదరగొడుతున్నా చల్లగా వున్నది. పరిస్థితులు మనకు సానుకూలంగా మారుతున్నాయి అని సంతృప్తి చెందాను. కాని హటాత్తుగా మనుమడు నా నిశ్శబ్దాన్ని, ఏకాగ్రతను భంగపరుస్తూ 'ఇవాళ నీ జేబులో రెండు పెన్నులు వున్నాయేమిటి తాతయ్యా! ఒకటి నీది. మరొకటి ఆఫీసులోది దొంగిలించి తీసుకొచ్చావు కదూ! అన్నాడు.

నాకు అరికాలి మంట నెత్తికెక్కింది. ఛ!నోరుమూసుకో! వేలెడంత లేవు. నీ కళ్ళకు నేను దొంగలా కన్పిస్తున్నానా! గట్టిగా కేక వేశాను. వాడు బిక్కమొగంవేసి ఏడుపు లంకించుకున్నాడు. ఈ అవస్థ ఇంకా ఒక్కరోజే కదా. ఎలాగోలా సర్దుకు పోవాలి అనుకొని వాణ్ణి సముదాయించబోయాను. కాని వాడు వూరుకోలేదు. రెండిట్లో ఒక పెన్ను కావాలి అని మంకు పట్టు పట్టాడు. నేను విని పించుకోలేదు. రేపటి ఇంటర్వ్యూకి నాకు రెండు పెన్నులూ కావాలి. వాటి పాత్ర చాలా కీలకం. మా ఇద్దరి కీచులాట మధ్యలో ఇల్లు వచ్చేసింది. మురిపెంగా పెంచిన మనుమడు ఏదడిగితే అది ఇచ్చే నేను ఇలా ఒక్కసారిగా పిసినారిగా మారడం చూసి మా ఇంటిల్లపాదీ వింతగా చూశారు. ఆ రోజు రాత్రి అందరూ పడుకున్నాక ఆ రెండు పెన్నులనూ భద్రంగా దాచి హాయిగా నిద్రపోయాను.

తెల్లవారి మామూలుగా తయారై ఆఫీసుకు వెళ్ళాను. సరిగ్గా టైమ్ ప్రకారం పదకొండు గంటలకు నటరాజన్ నా గదిలోకి ప్రవేశించాడు. ఉచితాసనాన్ని అధిష్టించి ప్రశ్నల వర్షం కురిపించసాగాడు. నేను మొదటే తయారై వుండడం వల్ల అన్ని ప్రశ్నలకూ టకటకా చెప్పాను. ఏవేవో అడుగుతున్నాడు. నేను జవాబులు చెబుతున్నాను. కాఫీలు త్రాగడం కూడా పూర్తయింది. కానీ ఇతడు నా హాబీల గురించి అడగడేం? ఆలోచనలో పడ్డాను. ఇంకాసేపయితే వెళ్ళిపోయేలా వున్నాడు. నేను అతన్ని అడిగాను.' నటరాజన్ గారూ, మీరు నా హాబీల గురించి అడగరేం?'. 'మీకు హాబీలంటూ ఏవీ లేవుకదండీ! అడవుల్లో నడవడం, వార్తాపత్రికలు చదవడం తప్ప!' అంటూ నర్మగర్భంగా నవ్వాడు.

'ఎవడండీ అలా అన్నది? నా హాబీ చాలా ఆసక్తికరమైనది' అన్నాను.

'ఏమిటండీ అది?' నటరాజన్ అడిగాడు.

'పెన్నులు సేకరించడం నా హాబీ'. అన్ని రకాల దేశాలవి. పాతవి, కొత్తవి సేకరిస్తుంటాను' అన్నాను.

' ఓహో! అలాగా!ఎన్ని కలాలు సేఏకరించారేమిటి ఇప్పటి వరకు?

'రెండు."ఒకటి 1982 కాలం నాటి పార్కర్. అది అమెరికాది. రెండవది రేనాల్డ్ బాల్‌పెన్' అని సమాధానమిచ్చేను. నటరాజన్ అసంతృప్తిగా పెదాలతో ప్ఛ!ప్ఛ! అని వింత ధ్వనులు చేశాడు.

' లాభం లేదండీ! రెండు పెన్నులు సేకరించి అది మీ హాబీ అంటే ఎలా? కనీసం వంద పెన్నులైనా వుండాలి! అప్పడే ఆ హాబీలో మీకు గల ఆసక్తి ఇతరులకు తెలుస్తుంది' అని కామెంటు చేశాడు.

నాకు వళ్ళు మండింది. 'నాగురించి మీరే మనుకుంటున్నారు? నేనో సుప్రసిద్ధ రచయితను. నేను తల్చుకుంటే వందకాదు. వందా పది రెండు రోజుల్లో సంపాదించగలన్ను, కాని ఇతర్లను అడుక్కునే అలవాటు నాకు లేదు. చాలా మొహమాటం మనిషిని. నా ఖర్మ'! అని తల బాదుకున్నాను.

నటరాజన్ హటాత్తుగా ఎగిరి గంతేశాడు. కుర్చీ నుంచి రెండడుగులు పైకి లేచాడు. తిరిగి యధాస్థితికొచ్చాక నావైపు సంభ్రమాశ్చర్యాలతో చూశాడు.

'ఈ విషయం ఇందాక ఎందుకు చెప్పలేదండీ?' ' మీరు రచయితనా? అందునా సుప్రసిద్ధులా? అయితే మీ హాబీ రచనలు చేయడం అన్నమాట! చాలా మంచి హాబీ సార్. ఇతర హాబీల్లా కాకుండా అందరికీ ఉపయోగం. ఆహా!ఓహో' అంటూ నటరాజన్ తెగ పొగిడి పారేశాడు. పొగిడాడో, తెగిడాడో ఓ క్షణం అర్థం కాలేదు. అయినా క్షమించా!

మరి పెన్నుల సేకరణ హాబీ సంగతేంచేద్దామంటారు? అని అడిగాను.

ఆయన 'ఛ! ఆ హాబీ మీకంత ఇబ్బంది కలిగిస్తుంటే వెంటనే వదలి వేయండి. రచనలు కొనసాగించండి' అని ఉచిత సలహా పారేసి వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం నేను ఇంటికి వెళ్ళి మా మనుమడికి అనాయాచితంగా నా వద్ద వున్న రెండు పెన్నులనూ బహూకరించాను. కాని చిన్న పిల్లల మనస్తత్వం అనుకుంటాను. వాడు వాటిని ఒక్కసారి తేరిపారజూసి చటుక్కున హాల్లో ఓ మూలకు విసిరేశాడు. అందులో నాకేదో సింబాలిక్‌గా తోచింది.

అలా నాజీవితంలోని ఒకే ఒక్క హాబీకి విచారంగానే గుడ్‌బై చేప్పేసి నా గదిలోకి ప్రవేశించి దడాలున తలుపులు మూసుకున్నాను.



పేర్వారం రాములు